మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఖాతా గ్రామస్తులు

మాజీ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత

నంగునూరు, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని ఖాతా గ్రామంలో మహాదేవస్వామి ఆలయంలో మార్చి 5 నుంచి 9వ తేదీవరకు జరిగే శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. దేవాయల కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్, మాజీ సర్పంచ్‌లు దశమంతరెడ్డి, రాములు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, పరమేశ్వర్, సురేశ్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

రాయపోల్, ఫిబ్రవరి 29: సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, నిర్లక్ష్యంతో వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు.గురువారం దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి గ్రామంలో మీషన్ భగీరథ తాగునీరు వృథాకాకుండా, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని ఆయన సూచించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ సంధ్యారవీందర్, జడ్పీటీసీ రణం జ్యోతీశ్రీనివాస్‌గౌడ్, మండల సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రవీందర్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, మండల కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, తహసీల్దార్ సుజాత, ఎంఈవో నర్సమ్మ, అధికారులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి

శివాలయంలో ప్రత్యేక పూజలు

బెజ్జంకి, ఫిబ్రవరి 29: మండలంలోని లక్ష్మీపూర్‌లో నూతనంగా నిర్మించిన శివాలయం విగ్రహప్రతిష్ఠలో రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సభిక్షంగా ఉండాలని కోరారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. వారి వెంట ఎంపీపీ నిర్మల, కోఆప్షన్ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌రావు, రాజయ్య, పాపయ్య, లక్ష్మారెడ్డి, స్వామి, దేవయ్య, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాజు, సంజీవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్‌జడ్జి శివరంజని

అక్కన్నపేట, ఫిబ్రవరి 29: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. గురువారం మండలంలోని కట్కూరులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరానికి నాలుగున్నర లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి కోర్టు కేసుల పరిష్కారం విషయంలో న్యాయ సహాయాన్ని అందించేందుకు ప్రతి మండలంలో న్యాయసేవాధికార సంస్థ కృషిచేస్తుందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సివిల్ కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వివేక్, ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి బానోతు జయరామ్, ఎంపీటీసీ సుదేష్ణ, మాజీ సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అండె భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు

అండె భాస్కర్

మిరుదొడ్డి, ఫిబ్రవరి 29: తెలంగాణ పల్లెల్లో మూడువేల మంది డప్పు కళాకారులకు శిక్షణ ఇచ్చి ఉన్నతులుగా తీర్చిదిద్దిన డప్పు కళాకారుడు అండె భాస్కర్‌కు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 27వ తేదీన అరుదైన అవార్డును ప్రకటించింది. తెలంగాణ కళా డప్పు వాయిద్యాన్ని ఖండాంతరాలు దాటించిన అండె భాస్కర్ ఢిల్లీ సంగీత నాటక అకాడమీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని మార్చి 5, 7వ తేదీల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మిరుదొడ్డిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి తనకు అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

రాజకీయాలకతీతంగా పాలన చేపట్టాలి

- అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు

చేర్యాల, ఫిబ్రవరి 29: రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు, పరిపాలన చేసినప్పుడే మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం 2024-25 ప్రత్యేక బడ్జెట్ సమాశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్, సిబ్బంది పట్టణానికి సంబంధించిన అభివృద్ధి పనులతో పాటు బడ్జెట్‌పై చర్చించారు.వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశంలో అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పట్టణాభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం పొందిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పలువురు పన్నులు చెల్లించి నప్పటికీ బకాయి ఉన్నట్లు నోటీసులు మున్సిపల్ నుంచి వస్తున్నాయనే విషయం నా దృష్టికి వచ్చిందని వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సవ్యంగా సాగేందుకు అన్నివర్గాలు సహకరించాలన్నారు. కౌన్సిలర్లు, అధికారులు, వార్డు ఇన్‌చార్జిలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు.

రూ.15 కోట్ల 79లక్షల బడ్జెట్‌కు ఆమోదం

చేర్యాల పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సర అంచనాల బడ్జెట్, 2022-23 ఆర్థిక సంవత్సరం సవరించిన ఆదాయవ్యయాల అంచనాల బడ్జెట్‌ను (రూ.15కోట్ల 79లక్షల బడ్జెట్‌కు ఆమోదం) మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేశ్, తుమ్మలపల్లి లీలా, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీశ్, కోఆప్షన్ సభ్యులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పచ్చిమడ్ల అంజనీదేవి, జేబాబేగం, యారవ ఆరోగ్యరెడ్డి, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్, రాములు, పాల్గొన్నారు.

రామలింగేశ్వరాస్వామి కల్యాణం కమనీయం



కల్యాణోత్సవంలో అమ్మవార్ల మాంగళ్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 29: బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సహిత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామివారికి గంగస్నానం చేయించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందజేశారు. ఉదయం రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధాపురం శివప్ప వైదిక నిర్వహణలో అర్చకులు మఠం శివకుమార్, సిద్ధాపురం భద్రప్ప శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇమ్మడి శోభ-పురుషోత్తం రెడ్డి, రాజపేట పద్మ-మల్లేశం దంపతులు వధూవరుల తరుపున కల్యాణాన్ని జరిపించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవం అనంతరం ఆర్యవైశ్య సత్రంలో పాత రాములు ఆధ్వర్యంలో మహాఅన్నదానం నిర్వహించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ!

నారాయణరావుపేట, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని మల్యాల ఎంపీయూపీఎస్‌లో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు.

మున్సిపాలిటీకి రూ.36.84లక్షల ఆదాయం

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 29: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి ఈ ఏడాది తైబజార్, పశువుల సంత వేలంతో రూ.36.84లక్షల ఆదాయం వచ్చింది. గురువారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సమక్షంలో పశువుల సంత, తైబజార్ వేలంపాట నిర్వహించారు. తైబజార్‌ను రూ. 21,54,000 గంగిశెట్టి రవి, పశువుల సంతను రూ.15,30,000 పాడి టి.రాజేశం దక్కించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాల లెక్చరర్‌గా ఎంపిక

కొమురవెల్లి, ఫిబ్రవరి 29 : మండలంలోని గురువన్నపేట నిరుపేద కుటుంబానికి చెందిన నక్క కల్యాణి గురువారం సాయంత్రం విడుదల చేసిన ఫలితాల్లో గురుకుల కళాశాల లెక్చరర్‌గా ఎంపికైంది. గత సంవత్సరం ఆగస్టులో పరీక్ష రాసిన కల్యాణి ఫిబ్రవరి 22న ఇంటర్వ్యూకు హాజరైంది. మార్చి 3వ తేదీన ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకొనుంది.

కూటిగల్ యువకుడు ఎంపిక

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 29: ప్రభుత్వం ప్రకటించిన గురుకుల కళాశాల జూనియర్ లెక్చరర్ పరీక్ష ఫలితాల్లో ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన భూర్సు బాబు గణిత విభాగంలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్‌గా బాబు ఎంపిక కావడంపై ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి29: ముదిరాజ్‌ల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్ అన్నారు. ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో భాగంగా గురువారం భవనానికి స్లాబ్ వేశారు. ఈ సందర్భంగా చొప్పరి సాగర్‌ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 11.50లక్షలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. నిధులు మంజూరు చేసిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, ఎంపీటీసీ చెట్కూరి కల్యాణిక మలాకర్, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ సంపత్ పాల్గొన్నారు.

సుడా వైస్ చైర్‌పర్సన్‌గా ప్రసన్నరాణి

సిద్దిపేట, ఫిబ్రవరి 29: సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్‌గా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కె.ప్రసన్నరాణిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటి వరకు సుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన రమణాచారి స్థానంలో ప్రసన్నరాణిని నియమించారు.

పల్స్‌పోలియోను సక్సెస్ చేయాలి

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 29: పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాహుల్ అన్నారు. గురువారం గజ్వేల్ ఐవోసీలోని సమావేశ మందిరంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పల్స్‌పోలియోపై అవగాహన కల్పించారు. మార్చి 3నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పల్స్‌పోలియోలో అందరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. డాక్టర్ సింగ్, కాశీం, సీహెచ్‌వో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, రూట్ సూపర్‌వైజర్ వాసుదేవ్, నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

గజ్వేల్, ఫిబ్రవరి 29: జూదం ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని రిమ్మనగూడలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రిమ్మనగూడ గ్రామ శివారులో కొంతమంది జూదం ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేయగా అదే గ్రామానికి చెందిన బొల్లారం ప్రసాద్, దయ్యాల కమలాకర్, ఎద్దు శ్రీనివాస్, భీమోల్ల శ్రీశైలం, పోసి రాములు జూదం ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.



సద్గురు మధుసూదానంద సరస్వతీ పీఠాధిపతిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ

గజ్వేల్, ఫిబ్రవరి 29: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని స్ప్రింగ్ ఫీల్డ్ ఇన్‌ఫ్రా కాలనీలో గురువారం మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. క్షేత్రపీఠం సద్గురు మధుసూదానంద సరస్వతీ పీఠాధిపతి కరకములచే విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. విగ్రహప్రతిష్ఠలో కాలనీవాసులు, ప్రముఖులు దర్శించుకోగా పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేశ్వర్‌రావు, గొడుగు రాజు, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, సత్తయ్య, నీల కనకయ్య, శ్రీకాంత్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, కర్రిక్ పాల్గొన్నారు.

లీప్ రోజు ఏడుగురు జననం

నాలుగేండ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరానికి ప్రత్యేకత ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో 28 రోజులుంటాయి. కానీ, లీప్ ఏడాది ఫిబ్రవరిలో ఒక రోజు అధికంగా 29 రోజులు ఉంటాయి. ఈ రోజు పుట్టిన వారంతా ప్రతి నాలుగు సంవత్సరాలకోసారి వచ్చే తమ జన్మదినాన్ని ఎంతో సంబురంగా జరుపుకుంటారు. కాగా, గురువారం గజ్వేల్ దవాఖానలో ఏడుగురు జన్మించారు. అందులో నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. వీరంతా తమ మొదటి పుట్టినరోజు వేడుకను జరుపుకోవాలంటే మరో నాలుగేండ్లు ఆగాల్సిందే. **– గజ్వేల్, ఫిబ్రవరి 29**

శిశువుతో తల్లి

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

వెంకటేశ్వర్‌రావును పరామర్శిస్తున్న నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 29: ఇటీవల గుండె చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూజల వెంకటేశ్వర్‌రావును గురువారం సిద్దిపేటలో ఆయన నివాసానికి పలువురు వెళ్లి పరామర్శించారు. కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవింద్‌రెడ్డి, ధర్మ వరం బ్రహ్మం, సద్ది నాగరాజురెడ్డి, వంగ తిరుమల్‌రెడ్డి, కళ్లకుంట మల్లికార్జున్, కో-ఆప్షన్ సభ్యుడు సత్తన్న, మాజీ కౌన్సిలర్ మార్క రాందాస్‌గౌడ్ ఉన్నారు.

చెత్తబుట్టలు అందించాలి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 29: తడి, పొడిచెత్తను సేకరించేందుకు ప్రతి ఇంటికీ చెత్త బుట్టలు అందించాలని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం వార్డుఅధికారులు, ఆర్పీల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మార్చి 2వతేదీ నుంచి తడి, పొడిచెత్త బుట్టలను ఆర్పీలు, వార్డు అధికారులు కలిసి ఇంటింటికీ అందజేయాలన్నారు. చెత్తబుట్టలు రాలేదనే ఫిర్యాదులు ప్రజల నుంచి రావద్దని ఆయన చెప్పారు. సమావేశంలో ఏఈ సాయిప్రణీత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ జాలింగం శంకర్, మెప్మా కోఆర్డినేటర్ ముత్యాల రాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

దౌల్తాబాద్‌లో సహకార భవనాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- సహకార బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలి
- రైతుల కోసమే మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దౌల్తాబాద్‌లో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం

రాయపోల్, ఫిబ్రవరి 29: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో నాబార్డు ద్వారా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమనాయకుడు కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయరంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఒకప్పుడు కరువుతో అల్లాడిన దుబ్బాక నియోజకవర్గంలో నేడు చెరువులు, కుంటలు, వాగులు మత్తడి దుంకుతున్నాయని గుర్తుచేశారు. నూతన పీఏసీఎస్ భవనం దౌల్తాబాద్, రాయపోల్ మండలాల పరిధిలోని రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య,దౌల్తాబాద్ ఎంపీపీ గంగాదరి సంధ్యారవీందర్, జడ్పీటీసీ రణం జ్యోతీశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అన్న రెడ్డి వెంకట్‌రెడ్డి, రాయపోల్ జడ్పీటీసీ యాదగిరి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, సొసైటీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, దౌల్తాబాద్ ఎంపీటీసీ అది వనితావేణుగోపాల్, సొసైటీ సీఈవో మల్లేశం, పాలకవర్గం డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు

మెడిటేషన్, యోగా చేయాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 29: ప్రతిరోజూ మెడిటేషన్, యోగా చేయాలని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం మహాశివరాత్రి సందర్భంగా త్రిమూర్తి శివ 88వ జయంతి మహోత్సవాల్లో ఆమె పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం త్రిమూర్తిశివ 88వ జయంతి మహోత్సవాల పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమానికి వచ్చిన వారితో బ్రహ్మకుమారీస్ సిద్దిపేటశాఖ ఇన్‌చార్జి భవానీ ధ్యానం చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గుడాల శ్రీకాంత్, బ్రహ్మ కుమారీస్ నిర్వాహకులు ఓంకారం, విమల, స్వప్న, పద్మ, తిరుపతిరెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి ఏర్పాటు

చొప్పరి మల్లేశం

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 29: ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ పాలకమండలిని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా బెక్కల్ గ్రామానికి చెందిన చొప్పరి మల్లేశం, సభ్యులుగా ఇమ్మడి శోభ (బైరాన్‌పల్లి), ధరావత్ సరిరామ్ (రెడ్యానాయక్ తండా), చెన్నోజు బ్రహ్మచారి(ధూళిమిట్ట), రాజుపేట మల్లేశం(లింగాపూర్), స్వర్గం సాంబయ్య(తోర్నాల), ఎక్స్-అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సిద్ధాపురం శివప్పను నియమించింది.

పరిశోధన దృక్పథాన్ని అలవర్చుకోవాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు పరిశోధన దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'ప్రాజెక్ట్ నివేదిక తయారీ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణకు ప్రాజెక్టుల తయారీ చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇలాంటి సదస్సు విద్యార్థులకు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి తోడ్పడుతుందన్నారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్,అధ్యాపకులు శ్రీనివాస్, సుదర్శనం తదితరులు ప్రసంగించారు. సదస్సులో 400లకు పైగా విద్యార్థులు పాల్గొని వారి అనుమానాలు, సమస్యలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయోధ్యరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు చేయూత

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 29: సిద్దిపేట వాసవి వనిత క్లబ్ రీజియన్ 3 జోన్ చైర్పర్సన్ కృష్ణవేణి పట్టణంలోని అభయజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అల్పాహారం, బియ్యం అందించి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేసి యాచకులకు చద్దర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట వాసవి వనిత క్లబ్ సేవలు బాగున్నాయని అధ్యక్షురాలు వాణి, కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

- 96 శాతం మంది విద్యార్థులు హాజరు..
- గైర్హాజరైన 371 మంది విద్యార్థులు..
- జనరల్ 97 శాతం, ఒకేషనల్ 92 శాతం నమోదు..

సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లావ్యాప్తంగా గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు సెట్ "ఏ" ప్రశ్నాపత్రాన్ని అధికారులు ఎంపిక చేశారు. జిల్లాలోని 44 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 9,941మంది విద్యార్థులకు 9,570 మంది విద్యార్థులు హాజరుకాగా 371 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 8,003 మంది జనరల్ విద్యార్థులకు 7,780 మంది హాజరుకాగా 223 మంది గైర్హాజరై 97 హాజరుశాతం నమోదైంది. 1,938 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,790 మంది విద్యార్థులు హాజరై 148మంది గైర్హాజరై 92 హాజరుశ